

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 182 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 02, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



## ఆగమవుతున్న తెలంగాణ ఆత్మగౌరవం





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

ఆవిర్భావానికె పరింతమా అభివృద్ధి ఎక్కడ

తెలంగాణ వాదాన్ని రాజకీయాలకు వాడుకుంటున్న ఆంధ్రోళ్లు

ఆవిర్భావ దినోత్సవంలో తెలంగాణ ఆత్మగౌరవం దాగింది

తెలంగాణను ఆగంచేస్తుంది ముమ్మాటికీ చొరబాటుదారులే

వలసవాదులే తెలంగాణకు నయవంచకులై కూర్చుంటున్నారు

ఆంధ్ర నాయకులు తెలంగాణను దోచుకుంటున్నారు

తెలంగాణ ఆత్మగౌరంలో వేలకొలది ప్రాణత్యాగాలు ఉన్నాయి

రాష్ట్ర సాధనతో మెరిసిపోయిన తెలంగాణ కేవలం మురిపిస్తుంది

తెలంగాణ రాష్ట్ర రథసారథి ముమ్మాటికి కెసిఆర్

నయవంచనకు గురవుతున్న తెలంగాణను రక్షించుకోవాలి

ఆంధ్ర పాలకుల కుట్రలను ఛేదించిన మొనగాడు కేసీఆర్ : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ జై భీమ్ డెస్క్

ఆత్మగౌరవానికి ఆకలి చావులకు ప్రతీకగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం నేటితో 12 సంవత్సరాలు నిండుకున్నదని డాక్టర్ బరిగెల శివ గర్వపడ్డారు. జూన్ 2 అనే తారీకు రాగానే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం ఒక్కసారిగా బలపడుతుందని ఆనాటి ఉద్యమ పోరాటాలు ఆనాటి ఆకలి చావులు ఆనాటి ఉద్యమ బలిదానాలు ఆనాటి రాజకీయ అణిచివేతలు ఒక్కసారిగా వెలుగులోనికి వస్తు తెలంగాణ ప్రజలను ఆకట్టుకుంటున్నాయని గుర్తు చేశారు. ప్రాంతీయేతర నాయకులందరూ తెలంగాణను తెలంగాణ ప్రాంతాన్ని కేవలం ఆస్తుల దోపిడీకి మాత్రమే వాడుకున్నారని సరిగ్గా 67 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం లాంచనంగా సిద్ధించిందని దాని ఫలితాన్ని తెలంగాణ ప్రజలు అనుభవించుకునే లోపే ప్రాంతీయేతరులు డేగల్లా వాలిపోయి తెలంగాణ ఆత్మగౌరవంతో చెలగాటలాడుతున్నారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించింది విద్యార్థి ఉద్యమకారులేనని గర్వంగా వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటు చేయబడిన రాజకీయ జేఏసీ కొనసాగించిన ప్రతి ఉద్యమంలో విద్యార్థులే దండిగా పాల్గొని దంచి కొట్టారని గుర్తు చేశారు అయినప్పటికీ 12 ఏళ్ల తెలంగాణలో అత్యధికంగా నష్టపోయింది మాత్రం విద్యార్థి ఉద్యమకారులే నంటూ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మా భవిష్యత్తు బాగుపడుతుందని ఉద్యమాలను ప్రాణంగా భావించిన తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన మినహా ఏమీ ఆశించలేదని ఇప్పటికీ అవే ఉద్యమాలకు కట్టుబడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి పది సంవత్సరాలు పాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆంధ్ర పాలకులను గాని కేంద్ర పాలకుల ఆగడాలను గాని తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వకుండా తన ప్రతాపాన్ని కనపరచారని అభినందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు తెలంగాణ ప్రాంతంలోని రాజధానైన హైదరాబాద్ పై విపరీతమైన కుట్రలు

- మిగతా 2లో..

## నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికత తీసుకువస్తాం: రేవంత్ రెడ్డి

కొమురంభీమ్ జిల్లాలో సీఎం పర్యటన

కొశారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశంలో పాల్గొన్న సీఎం


రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ

2



## రెండు కీలక హైకోర్టు తీర్పులు విద్యార్థులకు ఊరట వ్యక్తిగత గోప్యతకు రక్షణ

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రెండు కీలక తీర్పులను తెలంగాణ హైకోర్టు,ఢిల్లీ హైకోర్టులు వెలువరించాయి




3


## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..

యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!

2

## ములమాడ గ్రామంలో ఉద్రిక్తత

దళిత కుటుంబంపై దాడి ఆరోపణలు..చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్



2




## రేవంత్‌కు 'సీఎం' కుర్చీ టెన్షన్..?

నాయకత్వ మార్పు ఊహాగానాలతో వేడెక్కుతున్న కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు

కర్ణాటక ఫార్ములా ప్రభావం తెలంగాణలోనూ పునరావృతమవుతుందా?

అధిష్టానం పనితీరు ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశంపై చర్చ

పార్టీ సమావేశాలు, ఢిల్లీ పర్యటనలపై ముఖ్యమంత్రి ప్రత్యేక నిఘా

అధికారిక ప్రకటనలేమీ లేని నేపథ్యంలో కొనసాగుతున్న రాజకీయ ఊహాగానాలు : డాక్టర్, బరిగెల శివ

3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికత తీసుకువస్తాం: రేవంత్ రెడ్డి

**కొమురంభీమ్ జిల్లాలో సీఎం పర్యటన**
**కొరారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశంలో పాల్గొన్న సీఎం**
**రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ**

హైదారబాద్, జై భీమ్ న్యూస్

నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికతను తీసుకువస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొమురంభీమ్ అసిఫాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ఈరోజు పర్యటించారు. కోరారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారందరూ ఇళ్లను నిర్మించుకోవాలని అన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇళ్లను ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రం మొత్తంలో ప్రారంభించే ఇళ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇళ్లను ప్రారంభిస్తామని అన్నారు.

# కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..

**యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!**
**సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం**
**రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్**
**టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరపున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

**టీజీపీఎస్సీలో ఇకపై అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగానే**
**ఓఎంఆర్ కంటే కంప్యూటర్ విధానమే అత్యంత సురక్షితం అన్న ఛైర్మన్**
**పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రం తయారు చేయవచ్చని వెల్లడి**
**పారదర్శకత కోసం ప్రతి 2-3 నెలలకు మీడియా సమావేశం ఏర్పాటు**
**అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని వ్యాఖ్య**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో నియామక పరీక్షల నిర్వహణకు కంప్యూటర్ ఆధారిత విధానమే అత్యుత్తమ మార్గం. సంప్రదాయ ఓఎంఆర్ విధానంతో పోలిస్తే ఇది ఎంతో సురక్షితమైనది. పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసే వెసులుబాటు ఉంటుంది" అని వివరించారు. కమిషన్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నామని, అభ్యర్థుల్లో విశ్వాసం నింపేందుకు సాంకేతికతను వాడుకుంటున్నామని తెలిపారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వడం సాధ్యం కాదని, అందుకే పోటీ పరీక్షల్లో కొందరికి నిరాశ తప్పదని ఆయన అన్నారు. కమిషన్‌పై వచ్చే నిరాధార విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పారదర్శకతను పెంచే ఉద్దేశంతో ఇకపై ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

# పవన్ కల్యాణ్ తెలంగాణలో సభ పెట్టుకోవచ్చు: యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పన్నెండేళ్లు పూర్తయిన తర్వాత కూడా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య బీఆర్ఎస్ పార్టీ కావాలనే వైషమ్యాలు రెచ్చగొడుతోందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణలో సభలు నిర్వహించుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా సభలు పెట్టుకునే హక్కు అందరికీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే సభల పేరుతో తెలంగాణను కించపరిచేలా మాట్లాడితే మాత్రం తాము చూస్తూ ఊరుకునేది లేదని ఆయన తేల్చిచెప్పారు. నిన్న మొన్నటి వరకు వైసీపీ అధినేత జగన్ తో కలిసి కేసీఆర్ చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నాడు ఏపీ ఎన్నికల్లో జగన్ వ్యతిరేకులను ఓడించడానికి కేసీఆర్ అన్ని విధాలుగా తెరవెనుక సహాయం చేశారని, అలాంటి వ్యక్తులు ఇప్పుడు తెలంగాణ ఆత్మగౌరవం అంటూ నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎండగట్టారు. రాబోయే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో అధికారంలోకి వచ్చేది ముమ్మాటికీ తమ కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల కంటే తమ ప్రభుత్వమే ప్రజా సంక్షేమంలో ముందుంటుందని జోస్యం చెప్పారు.

# ఆగమౌతున్న తెలంగాణ ఆత్మగౌరవం

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారని నిలదీశారు.ఒక హైదరాబాద్ ప్రాంతంలోనే లెక్కకు మించిన వలసవాదులు నివాసం ఉంటున్నారని వాళ్లంతా హైదరాబాద్ ప్రాంతాన్ని నిలువునా దోచుకుంటున్నారని దుయ్యపడ్డారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇతర రాష్ట్రాల వలసవాదుల సంఖ్య మరింతగా పెరిగిందని పరిశ్రమల వ్యాపారం పేరుతో తెలంగాణ ఆస్తులను దోచుకుంటూనే ఉన్నారని ఇప్పటికీ హైదరాబాద్ ప్రాంతం వలుసవాదుల చేతుల్లోనే ఉందని, ఇప్పటికీ హైదరాబాద్ ప్రాంతం ప్రాంతీయేతరుల అధిపత్యంలోనే కొనసాగుతుందని మండిపడ్డారు.

**రాష్ట్ర రాజకీయాలు రాజీపడుతున్నాయి.**

తెలంగాణ ప్రాంతం ఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలుస్తుందని దేశవ్యాప్తంగా ఉద్యమం పేరు ప్రస్తావించబడుతున్న ప్రతి సందర్భంలో తెలంగాణ రాష్ట్రమే ప్రత్యేకంగా నిలుస్తుందని ప్రతి ఒక్కరు భావిస్తున్న తరుణంలో తెలంగాణ రాజకీయాలు ఇతర రాష్ట్రాల పాలకుల చేతుల్లో రాజీ పడుతున్నాయని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు.తెలంగాణ రాజకీయాలను పూర్తిస్థాయిలో ప్రభావితం చేయలేని పాలకులు చాలామంది ఇతర రాష్ట్ర నాయకులపై ఆధారపడాల్సి వస్తుందని తెలంగాణ ఆత్మగౌరవం కోసం పనిచేయాల్సిన నాయకులందరూ అంతుచిక్కని ఆస్తులు సంపాదించుకుంటున్నారని అందులో భాగంగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే కార్యక్రమాలకు పూనుకుంటున్నారని బాధపడ్డారు.పక్క రాష్ట్రాల రాజకీయ నాయకులు తెలంగాణలో పాతుకుపోతూ సభలు సమావేశాలు వ్యాపారాలు చేస్తూ స్థిరాస్తులు సంపాదించుకుంటూ తెలంగాణ ప్రజలను బానిసల కన్నా హీనంగా చూస్తున్నారని ఇలాంటి పరిస్థితులను జ్ఞాపకం చేసుకుంటుండగా తెలంగాణ రాష్ట్రం ఎందుకు ఏర్పడిందని సందేహాలు కూడా తెలంగాణలోని కోట్లాదిమంది ప్రజల్లో మెదులుతుందని బాధపడ్డారు.కేవలం ఒకే ఒక్క రాజకీయ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకుల చేతుల్లో నలిగిపోతూ వేధించబడుతూ అవమానపరచబడుతూ అసహ్యించబడుతూ తెలంగాణ సమాజంలో బలహీనపరచబడుతూ అన్నింటిని ఎదుర్కొని ఏకంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే స్థాయికి ఎదిగిన బీఆర్ఎస్ పార్టీని అభినందించి తీరాలని అన్నారు.12 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల బాధలను ఏ పాలకులు పట్టించుకోకపోవడం ఒకింత బాధగా ఉందన్నారు.దానికి తోడు తెలంగాణలో రాజకీయాలన్నీ వేడివేడిగా సాగుతున్నాయని ధన వ్యయంతో కూడుకున్న రాజకీయాలు నడుస్తుండడంతో సాదరణ ఉద్యమకారులు తెలంగాణ మేధావులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని గుర్తు చేశారు.అదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఆంధ్ర పాలకులకు ఇతర రాజకీయ పార్టీ నాయకులకు తెలంగాణ ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని చాలా సందర్భాల్లో ఇతర రాష్ట్ర పాలకులతో రాష్ట్ర అభివృద్ధి పేరు మీద తెలంగాణ రాజీ పడుతున్నాయని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ ప్రాంతం ఇతర రాష్ట్రాల వ్యాపారస్తులతో నిండుకొని పోయిందని తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందబడుతుందని భావిస్తున్న సందర్భంలోనే అంతే స్థాయిలో వెనుకబాటుతనాన్ని ప్రదర్శిస్తుందన్నారు.హైదరాబాద్ ప్రధాన ప్రాంతాలను అభివృద్ధి చేసిన గత పాలకులు, ప్రస్తుత పాలకులు హైదరాబాద్ ప్రాంతం మొత్తం ఇతర ప్రాంతాల వాసులతో నిండిపోయినదని మాత్రం గుర్తించలేకపోవడం బాధాకరంగా ఉందన్నారు.ప్రతి రాజకీయ నాయకుడు ద్వంద వైఖరిని ప్రదర్శిస్తూ తెలంగాణ ప్రాంత ప్రయోజనాల కన్నా వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలను అభివృద్ధి పరచుకుంటున్నారని అలాంటి వాళ్ళ పరిపాలనలతో తెలంగాణ ప్రజలకు ఏమాత్రం ఉపయోగం ఉండదన్నది వాస్తవం అన్నారు.తెలంగాణ ప్రజలకు ఎలాంటి వనరులను సమకూర్చాలో ఎలాంటి ప్రయోజనాలతో అభివృద్ధి పరచాలో తెలంగాణ పాలకులకు ఇప్పటికీ ఒక రకమైన అవగాహన రాకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఏర్పాటును ఎప్పుడు ప్రస్తావించాల్సి వచ్చిన నిరుద్యోగులు ఉద్యమకారులు నిరుద్యోగ యువత ప్రాణత్యాగాలే ప్రప్రదంగా ప్రథమ స్థానంలో గుర్తుకు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.రాజకీయ నాయకులు వాళ్లకు లభించిన పదవులతో కాస్తో కూస్తో అభివృద్ధి చెందినారని కొంతమంది నాయకులైతే లెక్కలేనన్ని ఆస్తులు సంపాదించుకున్నారని గుర్తు చేశారు.

**ఉద్యమకారుల ఊసే లేదు.**

మా రాష్ట్రం మా భవిష్యత్తు అనే తరహాలో తెలంగాణ ఉద్యమకారులు స్థాయికి మించి రెచ్చిపోయి పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని గర్వంగా చెప్పారు.తెలంగాణ ఉద్యమకారులు ప్రతి సందర్భంలో ఇప్పటికీ అణిచివేత అనుభవిస్తున్నారని ఉద్యమాలు ప్రస్తావిస్తేనే పాలకులు కేసులు కట్టిస్తున్నారని చిన్న స్థాయి ఉద్యమకారులను మొదలుకొని నిరుద్యోగ యువత విశ్వవిద్యాలయాల యువత ప్రాణ త్యాగాలు చేసుకున్న కుటుంబాల యువత మేధావి ఉద్యమకారులు అందరికన్నా తెలంగాణ మీడియా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ అభివృద్ధి చెందలేదని ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లుగా రాజకీయ పాలకులకు,రాజకీయ వర్గాలకు అనుకూలమైన వ్యక్తులు మాత్రమే అభివృద్ధి చెందారని రాజకీయాలకు ప్రతీకగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన నిజమైన నికార్సైన విద్యార్థి ఉద్యమకారులు మేధావులు ఇప్పటికీ త్యాగాలకే పరిమితమైపోయారని దీనికి అంతటి కారణం తెలంగాణను పాలిస్తున్న నాయకులలో స్వార్థం పెరిగిపోవడం ఒకరకమైన కారణమైతే తెలంగాణ ప్రాంతాన్ని ఇతర రాష్ట్రాల పాలకులు డామినేట్ చేయడం ఇంకో రకమైన కారణమన్నారు.మొత్తం మీదుగా తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులు నీళ్లు నియామకాలు ఇప్పటికీ నెరవేరకపోవడం రాష్ట్రాన్ని పాలిస్తున్న పాలకుల అసమర్థతో కేంద్రం చేతిలో నలిగిపోవడం ఎటు తేల్చుకోలేని పరిస్థితులు తెలంగాణ రాష్ట్రంలో బలంగా ఏర్పడి కూర్చున్నాయన్నారు.

**ఉద్యోగాల నియామక కొరత.**

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు సంస్థల వ్యాపారాలు పెరిగిపోతుండగా ప్రభుత్వ వ్యవస్థల ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిపోయిందని వాటితోపాటు తెలంగాణ రాష్ట్రంలో నియామకం చేపడుతున్న ప్రతి ఉద్యోగ నియామకంలో అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతుందని ప్రతి ఉద్యోగ నియామకంలో లెక్కలేనన్ని ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో నియామకం చేపట్టిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు న్యాయస్థానాలను ఆశ్రయించేలా ప్రభావితం చేయగలిగాయంటే ఉద్యోగ నియామకాలు పారదర్శంగా జరగడం లేదని స్పష్టంగా అర్థమయిపోతుందన్నారు పాలకులు ఎవరైనా పాలిస్తున్నది ఎవరైనా నిరుద్యోగ యువత జీవితాలను బుగ్గి పాలు చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప నిజాయితీతో నిబద్ధతతో ఉద్యోగాలను కల్పించలేకపోతున్నారని తీవ్రంగా మందలించారు.పైగా ఉద్యోగ నియామకాలకు సంబంధించిన కేసులలో న్యాయస్థానాలను ఆశ్రయించి నిరుద్యోగ యువత కేసులు వేసుకొని పోరాటాలు చేస్తున్న నిరుద్యోగ యువతకు చివరకు ఆదరణ కూడా కరువయ్యే పరిస్థితిలు ఎదురవుతున్నాయని రాజకీయ అధికార పలుకుబడుల ముందు నిరుద్యోగ యువత చతికిలబడుతున్నారని న్యాయస్థానాలను ఆశ్రయించబడుతున్న ప్రతీ కేసులలో ఎంతో బలమున్నప్పటికిని ఎంతో నాణ్యత కలిగిన సమాచారం ఉన్నప్పటికీని కేవలం అధికార పక్షం వైపు న్యాయస్థానాలు మొగ్గుచూపడం నిరుద్యోగ యువతను పూర్తిగా నిరుత్సాహపరచడంతో పాటు సమాజానికి తప్పుడు సాంకేతాలను ఇస్తుందన్నది వాస్తవమన్నారు.చాలా కేసులలో కింది కోర్టులు సరిమైన తీర్పిస్తే పై కోర్టులు వాటికి కొట్టివేస్తున్నాయని ఈ విధంగా ప్రస్తావించాల్సి వస్తున్న ప్రతి సందర్భంలో తెలంగాణ నిరుద్యోగ యువత పోరాటాలకు పరిమితమైపోయి ప్రాణాలు చాలిస్తున్నారు తప్ప 90 శాతం నిరుద్యోగ యువత జీవిత లక్ష్యాలను చేరుకోలేక వెనుకబడిపోతున్నారని ఎంతో ఉన్నత చదువులు చదువుకున్న యువత కూడా నిరుద్యోగంతో బాధపడుతూనే ఉన్నారు తప్ప ప్రభుత్వ కొలువులు వచ్చేది ఎప్పుడు అంటూ 12 సంవత్సరాలుగా లైబ్రరీల చుట్టూ తిరుగుతూ చదువుతూనే ఉన్నారని తీరా ఉద్యోగ నియామకాలకు ప్రకటనలు వచ్చేసరికి సంపన్న వర్గాలు ఉద్యోగాలను దోచుకుంటున్నారని దీని బట్టి చూస్తే తెలంగాణ ప్రాంతంలో నిరుద్యోగ యువత కేవలం ఉద్యమాలకే పనికి వస్తారన్నది తేలిపోతుందన్నారు.చదువులు పూర్తయిన యువత కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారని నాలుగు పదుల వయస్సు దాటిన యువత జీవిత లక్ష్యాలను చేరుకోలేక వాళ్ళ వాళ్ళ జీవితాలు అగమ్య గోచరంగా మారిపోయి ఆందోళన చెందుతూ తీవ్రమైన మనస్థాపానికి లోనై సమాజానికి దూరంగా జీవిస్తున్నారని.కాస్తో కూసో ఉద్యోగాలు సంపాదించుకున్న సాఫ్ట్వేర్ ఉద్యోగులు కూడా ఇంటిదారి పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని మొత్తం మీదుగా తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు ఎటువైపు నడిపించబడుతుందో ఇప్పటికీ నిరుద్యోగ యువతకు అర్థం కాకుండా పోతుందని అదే సందర్భంలో రాజకీయ ఎన్నికల అప్పుడు మాత్రమే నిరుద్యోగ యువతను ప్రచారాలకు వాడుకునే సంస్కృతిని తెలంగాణలో వ్యాపింపజేస్తూ ఉద్యోగాల కాడ భవిష్యత్తు నిర్మాణం కాడ ఉన్నత విద్య కాడ దూరం పెట్టే పరిస్థితులు తెస్తున్నారని వాటన్నిటిని బట్టి గమనిస్తుంటే పాలకుల పద్ధతి మారేది ఎప్పుడు అంటూ తెలంగాణ యువత తెలంగాణ నిరుద్యోగ యువత తెలంగాణ ఉద్యమకారుల యువత తెలంగాణ మేధావులు తెలంగాణ పాలకులను సూటిగా ప్రశ్నిస్తున్నారన్నారు.



# ములమాడ గ్రామంలో ఉద్రిక్తత

**దళిత కుటుంబంపై దాడి**
**ఆరోపణలు..చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్**

వికారాబాద్(జై భీమ్ న్యూస్)

వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం ములమాడ గ్రామంలో దళిత కుటుంబంపై దాడి జరిగిందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పాత కక్షల నేపథ్యంలో గ్రామ సర్పంచ్ భర్త నరేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి దళిత కుటుంబంపై దాడికి పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల వివరాల ప్రకారం, జిన్నారం బాలరాజు కుటుంబం నివాసానికి సుమారు 70 మంది వ్యక్తులతో చేరుకున్న నరేందర్ రెడ్డి వర్గీయులు మహిళలు, పురుషులు, చిన్నారులపై దాడి చేశారని తెలిపారు. ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసి బయటకు విసిరివేశారని, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఘటన సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ దాడిని అడ్డుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో నరేందర్ రెడ్డి వ్యవహార శైలిపై గతంలోనూ



పలు విమర్శలు వచ్చాయని స్థానికులు పేర్కొంటున్నారు. వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన సందర్భాల్లో కూడా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గతంలోనూ వినిపించాయని చెబుతున్నారు. దళిత కుటుంబంపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం సహా సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# రేవంత్‌కు 'సీఎం' కుర్చీ టెన్షన్..?

**తెలంగాణ కాంగ్రెస్‌లో వేడెక్కుతున్న రాజకీయ చర్చలు**
**డాక్టర్, బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ స్పెషల్)**

తెలంగాణ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవిపై రాజకీయ వర్గాల్లో కొత్త చర్చలు మొదలయ్యాయి. కర్ణాటకలో సిద్ధరామయ్య నాయకత్వంపై జరిగిన చర్చల మాదిరిగానే తెలంగాణలో కూడా భవిష్యత్తులో సీఎం మార్పు ఉండొచ్చన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ అంతర్గత పరిణామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం,రాష్ట్ర మంత్రుల కార్యకలాపాలు, ఢిల్లీ పర్యటనలు, అధిష్టానంతో జరుగుతున్న భేటీలపై రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో మూడు సంవత్సరాల పాలన పూర్తైన తర్వాత పనితీరు ఆధారంగా నాయకత్వ మార్పులు ఉండొచ్చన్న సంకేతాలు అధిష్టానం నుంచి వస్తున్నాయనే చర్చ కూడా కొనసాగుతోంది. ఇదే సమయంలో తనపై ఎవరైనా రాజకీయ కుట్రలకు పాల్పడే అవకాశం ఉందన్న అనుమానంతో రేవంత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్వహిస్తున్న సమావేశాలకు రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వడం కూడా రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. గతంలో పార్టీ వ్యవహారాలకు సంబంధించిన కొన్ని సమావేశాలను పెద్దగా పట్టించుకోనట్లు కనిపించిన రేవంత్,ఇప్పుడు ప్రతి సమావేశంలో పాల్గొంటూ అధిష్టానం వైఖరిని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. పార్టీలో వ్యతిరేక వర్గాలకు దగ్గరయ్యే నేతలను కూడా సమన్వయం చేసుకునే దిశగా రేవంత్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతం పేరుతో జాతీయ నాయకత్వంతో మరింత సన్నిహితంగా ఉండేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ముఖ్యమంత్రి మార్పు లేదా రేవంత్ రెడ్డి పదవికి ఎలాంటి ముప్పు ఉందనే విషయంపై కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు, ప్రచారాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అభిప్రాయాలుగానే పరిగణించాల్సి ఉంది. అయినప్పటికీ తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.



# కార్మిక ఉద్యమం నుంచి సామాజిక సేవ వరకు...










**డాక్టర్ చిలుకు స్వామి ప్రస్థానం**
**యువతకు ఆదర్శం**

**(ఎడిటర్ జై భీమ్ స్పెషల్)**

సాధారణ కుటుంబంలో జన్మించి అసాధారణమైన సంకల్పంతో సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి డాక్టర్ చిలుకు స్వామి.యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారజీపేట గ్రామానికి చెందిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.పేదరికం, ఆర్థిక ఇబ్బందులు,సామాజిక సవాళ్లను అధిగమించి విద్య, ఉద్యోగం,కార్మిక ఉద్యమం, సామాజిక సేవ, గ్రామాభివృద్ధి రంగాల్లో విశేష కృషి చేస్తూ వేలాది మందికి ఆదర్శంగా నిలిచారు. తండ్రి చిలుకు యాదగిరి, తల్లి యాదమ్మ దంపతులకు జన్మించిన స్వామి చిన్ననాటి నుంచే వినయం, క్రమశిక్షణ, సేవాభావంతో ఎదిగారు. కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా విద్యపై ఉన్న ఆసక్తిని కోల్పోలేదు. విద్యే జీవితాన్ని మార్చగల శక్తి అనే నమ్మకంతో కష్టపడి చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించారు. శారజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000లో పదో తరగతి పూర్తి చేసిన ఆయన, 2003లో ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో 2006లో డిగ్రీ పట్టా పొందారు. 2007లో బి.ఎడ్ పూర్తి చేసి విద్యారంగంపై తన ఆసక్తిని చాటుకున్నారు. ఉన్నత విద్యపై ఉన్న తపనతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధనలు నిర్వహించి 2009-10లో పీహెచ్‌డీ పట్టా సాధించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక సాధారణ విద్యార్థి డాక్టరేట్ స్థాయికి చేరుకోవడం ఆయన కృషి, పట్టుదల, విద్యపై ఉన్న అంకితభావానికి నిదర్శనం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో డాక్టర్ చిలుకు స్వామి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా జరిగిన ఆందోళనలు, దీక్షలు, నిరసన కార్యక్రమాల్లో భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఆయన కేవలం రాజకీయ అంశంగా కాకుండా ఆత్మగౌరవ పోరాటంగా భావించారు. యువతలో చైతన్యం కల్పించేందుకు అనేక సమావేశాలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. 2013లో జరిగిన రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ పరీక్షలో ఉత్తీర్ణులై భారతీయ రైల్వే శాఖలో ట్రాక్‌మన్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో ట్రాక్ మెయింటైనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా బాధ్యతగా భావించిన ఆయన, రైల్వే భద్రతతో పాటు సహచర కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉద్యోగ భద్రత, వేతన సమస్యలు, సంక్షేమ పథకాలు, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతరం గళమెత్తుతూ కార్మికుల విశ్వాసాన్ని సంపాదించారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కామ్రేడ్ చి. శంకర్ రావు మార్గదర్శకత్వంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన, తన సేవా భావం, నాయకత్వ లక్షణాలతో అంచెలంచెలుగా ఎదిగి కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పోరాడుతూ వేలాది మంది ఉద్యోగులకు అండగా నిలిచారు. 2023లో జరిగిన ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన డాక్టర్ చిలుకు స్వామి, ఉద్యోగుల ఆర్థిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సుమారు 42 వేల మంది సభ్యులకు సేవలు అందిస్తున్న ఈ సంస్థ ద్వారా 30 వేల మందికి పైగా ఉద్యోగులకు దాదాపు రూ.2,000 కోట్ల రుణ సదుపాయాలు అందించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సేవల ద్వారా అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడి విద్య, వైద్యం, గృహ నిర్మాణం వంటి అవసరాలను తీర్చుకునే అవకాశం పొందాయి. ఉద్యోగ జీవితంతో పాటు గ్రామాభివృద్ధిని తన బాధ్యతగా భావించిన డాక్టర్ చిలుకు స్వామి,శారజీపేట గ్రామంలో "మిత్ర యువజన సేవాసంస్థ"ను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన, యువతలో సామాజిక చైతన్యం, విద్యార్థులకు మార్గనిర్దేశం వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అన్న నమ్మకంతో "చిలుకు ఫౌండేషన్"ను స్థాపించి నిరుపేద విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్నారు. పుస్తకాలు,ఫీజులు,విద్యా సామగ్రి అందిస్తూ అనేక మంది విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడుతున్నారు. సేవ అంటే కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని విశ్వసించే ఆయన, సామాజిక సేవను తన జీవిత ధ్యేయంగా మార్చుకున్నారు. సామాజిక సేవా రంగంలో చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా డాక్టర్ చిలుకు స్వామికి అనేక పురస్కారాలు లభించాయి. ముఖ్యంగా 2025లో అంతర్జాతీయ స్థాయిలో ప్రదానం చేసిన "గ్రీన్ అచీవ్‌మెంట్ అవార్డు" ఆయన సేవలకు దక్కిన విశిష్ట గౌరవంగా నిలిచింది. అలాగే కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న రైల్వే ఉద్యోగిగా ఆయనకు ప్రతిష్టాత్మక "శ్రమశక్తి అవార్డు" కూడా లభించింది. మేడే సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. గత 14 సంవత్సరాలుగా కార్మిక సంఘాల ద్వారా చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ఈ అవార్డు ద్వారా ఆయన స్వగ్రామం శారజీపేటకు ప్రత్యేక గుర్తింపు లభించగా గ్రామ ప్రజలు, సహచర ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ చిలుకు స్వామి అభిప్రాయం ప్రకారం ప్రజల ప్రేమ, కార్మికుల విశ్వాసం, గ్రామ ప్రజల ఆశీర్వాదమే నిజమైన పురస్కారం. అందుకే ఆయన సేవలను ప్రచారం కోసం కాకుండా బాధ్యతగా కొనసాగిస్తున్నారు. సాధారణ కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి, ఉద్యోగ బాధ్యతలతో పాటు సమాజ సేవలోనూ ముందంజలో నిలుస్తున్న డాక్టర్ చిలుకు స్వామి నేటి యువతకు ఆదర్శప్రాయుడు. "సేవే శ్వాస... సమాజమే కుటుంబం"అనే భావనతో ముందుకు సాగుతున్న ఆయన జీవితం యువతకు స్ఫూర్తి, సమాజానికి దారిదీపం, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచిపోతుంది.ఆయన ప్రస్థానం కేవలం ఒక వ్యక్తి విజయగాథ మాత్రమే కాదు, సంకల్పం,కృషి,విద్య, సేవాభావం కలిస్తే ఒక మనిషి సమాజంలో ఎంతటి మార్పు తీసుకురాగలడో చెప్పే గొప్ప ఉదాహరణ.

## కేరళలో దారుణం తల్లి ప్రియుడి హింసకు బలైన ఏడాదిన్నర చిన్నారి



**జై భీమ్ న్యూస్ (కేరళ)**

కేరళ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఓ అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. నెడుమంగాడ్‌లో ఏడాదిన్నర వయసున్న చిన్నారి తన తల్లి మరియు ఆమె ప్రియుడి క్రూర హింసకు బలైన ఘటన తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. మొదట చిన్నారి గొంతులో ఆహారం ఇరుక్కుపోవడంతో మరణించిందని కుటుంబ సభ్యులు చెప్పగా,పోస్ట్‌మార్టం నివేదికలో అసలు నిజాలు బయటపడ్డాయి. చిన్నారి శరీరంపై మొత్తం 51 గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. సిగరెట్‌తో కాల్చిన గాయాలు, పాదాల అడుగుభాగంలో కాలిన మచ్చలు,రెండు చేతులు విరిగిపోవడం, జననాంగాలపై గాయాలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. తీవ్ర శారీరక హింస, దాడుల కారణంగానే చిన్నారి మృతి చెందినట్లు పోస్ట్‌మార్టం నివేదిక స్పష్టం చేసింది. దీంతో కేసు దర్యాప్తు మలుపు తిరిగింది. ఈ ఘటనలో చిన్నారి తల్లి అఖిల, ఆమె ప్రియుడు అష్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన సమక్షంలోనే చిన్నారిపై ప్రాణాంతక హింస జరిగినట్లు అఖిల విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అమాయక చిన్నారిపై అమానుష హింసకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన కేరళతో పాటు దేశవ్యాప్తంగా చిన్నారుల భద్రత, కుటుంబ హింస వంటి అంశాలపై మరోసారి చర్చకు దారితీసింది.

## రెండు కీలక హైకోర్టు తీర్పులు విద్యార్థులకు ఊరట వ్యక్తిగత గోప్యతకు రక్షణ

**దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రెండు కీలక తీర్పులను తెలంగాణ హైకోర్టు,ఢిల్లీ హైకోర్టులు వెలువరించాయి**

**జై భీమ్ న్యూస్(హైదరాబాద్)**

మొదటి కేసులో విద్యార్థులు ఫీజులు చెల్లించలేదనే కారణంతో వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యా సంస్థలు తమ వద్ద ఉంచుకోవడం చట్టవిరుద్ధమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. సర్టిఫికెట్లు విద్యార్థుల చదువు, ప్రతిభకు సంబంధించినవని, వాటిని బకాయిల కోసం తాకట్టు పెట్టుకోవడానికి విద్యాసంస్థలకు ఎలాంటి హక్కు లేదని పేర్కొంది. ఫీజు బకాయిలుంటే చట్టపరమైన మార్గాల్లో వసూలు చేసుకోవాలని, కానీ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా సర్టిఫికెట్లు నిలిపివేయకూడదని ఆదేశించింది. మరోవైపు, మెయింటెనెన్స్ కేసులలో భార్య తన భర్త ఆదాయపు పన్ను వివరాలను సమాచార హక్కు చట్టం (≈×) ద్వారా పొందలేరని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఆదాయపు పన్ను రిటర్నులు పూర్తిగా వ్యక్తిగత సమాచార పరిధిలోకి వస్తాయని, వాటిని బహిర్గతం చేయడం గోప్యతకు భంగం కలిగించడమేనని కోర్టు పేర్కొంది. భర్త ఆదాయ వివరాలు తెలుసుకోవాలంటే సంబంధిత కోర్టుల ద్వారా చట్టబద్ధమైన మార్గాలను అనుసరించాలని సూచించింది. ఒక తీర్పు విద్యార్థుల హక్కులను కాపాడగా.. మరో తీర్పు వ్యక్తిగత గోప్యతకు రక్షణ కల్పించింది.ఈ రెండు తీర్పులు దేశవ్యాప్తంగా కీలక చర్చకు దారితీశాయి.

## ప్రత్యేక తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలు

**ఢిల్లీ జంతర్ మంతర్‌లో తెలంగాణ స్వరం వినిపించిన జర్నలిస్టులు**



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)జూన్2**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టుల పాత్ర కీలకమని జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. 2011లో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం దేశ రాజధానిలో నిర్వహించిన ఆందోళనల్లో జర్నలిస్టులు సైతం ఉద్యమకారులతో కలిసి తెలంగాణ ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, జర్నలిస్టులు చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన నేటి తరుణంలో ఉద్యమ కాలంలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం గర్వకారణమని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన ప్రతి పోరాట ఘట్టం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

## ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తున్న ఫిజిక్స్ వాలా సంస్థను మూసివేయాలి

**ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్న డీఐఈఓను సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ**



**హనుమకొండ, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ అనుమతులు లేకుండా అకాడమీ పేరుతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఫిజిక్స్ వాలాః విద్యాసంస్థపై వెంటనే చర్యలు తీసుకుని మూసివేయాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ, హనుమకొండ నగరంలోని నక్కలగుట్ట ప్రాంతంలో ఫిజిక్స్ వాలా పేరుతో ఒక ప్రైవేట్ విద్యాసంస్థ ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేపడుతోందని ఆరోపించారు. ఇంటర్ బోర్డుతో ఎలాంటి అనుబంధం లేకుండా అకాడమీ పేరుతో విద్యార్థులను ఆకర్షిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. నగరవ్యాప్తంగా భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి అడ్మిషన్లు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కళాశాల నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు, సరైన భవనం కూడా లేవని, ఒక ఇంట్లోనే బోర్డులు ఏర్పాటు చేసి అడ్మిషన్లు చేపడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ విద్యను వ్యాపారంగా మార్చారని మండిపడ్డారు. ఇలాంటి అక్రమాలు జరుగుతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) స్పందించడం లేదని, ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిజిక్స్ వాలా సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే మూసివేయాలని, అలాగే ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఐఈఓపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఫిజిక్స్ వాలా విద్యాసంస్థ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, నాగరాజ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ వెబ్ ఆప్షన్లలో ఎక్కువ ప్రాధాన్యతలు ఇవ్వాలి

**కాలేజీ లేదా కోర్సు ప్రాధాన్యతను విద్యార్థులే నిర్ణయించుకోవాలి: లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి**

**హన్మకొండ, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



దోస్త్ రెండో విడతలో సీటు పొందిన విద్యార్థులు జూన్ 5వ తేదీలోపు తమ సీటును సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మ్ చేసుకోవాలని, ఆ సమయంలో అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు అక్నాలెడ్జ్‌మెంట్ ఆర్డర్ కాపీని తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని పింగళి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి సూచించారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అక్నాలెడ్జ్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేయని పక్షంలో విద్యార్థులు తమకు వచ్చిన సీటును కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి విద్యార్థి అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు అక్నాలెడ్జ్‌మెంట్ ఆర్డర్ కాపీని కూడా భద్రపరచుకోవాలని తెలిపారు. దోస్త్ మూడో దశ ప్రవేశ ప్రక్రియ మే 31 నుంచి జూన్ 15 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. మొదటి, రెండో దశల్లో సీటు రాని విద్యార్థులు, అలాగే మరింత మెరుగైన కళాశాల లేదా కోర్సులో ప్రవేశం కోరుకునే వారు మూడో దశ వెబ్ ఆప్షన్లను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్లు నమోదు చేసే సమయంలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో కాలేజీలు, కోర్సులను ఎంపిక చేసుకోవాలని, తక్కువ ఆప్షన్లు ఇవ్వడం వల్ల చాలా మంది సీట్లను కోల్పోతున్నారని తెలిపారు. దోస్త్‌లో ఎన్ని ఆప్షన్లు అయినా ఇచ్చుకునే అవకాశం ఉందని, విద్యార్థులు ఇచ్చిన ప్రాధాన్యతల ఆధారంగానే సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించారు. కాలేజీకి ప్రాధాన్యత ఇవ్వాలా, కోర్సుకు ప్రాధాన్యత ఇవ్వాలా అనే విషయాన్ని విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలు, ఆసక్తులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయించుకోవాలని సూచించారు. సరైన ప్రణాళికతో వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తే మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. దోస్త్ మూడో దశ ఫలితాలు జూన్ 20న విడుదల కానున్నాయని తెలిపారు. మొదటి, రెండో, మూడో దశల్లో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 20 నుంచి 26వ తేదీ మధ్య సంబంధిత కళాశాలలో సీసీ ఓటీపీ ద్వారా తమ ప్రవేశాన్ని ఖరారు చేసుకోవచ్చని చెప్పారు. కళాశాలలో అడ్మిషన్ సమయంలో ఇంటర్మీడియట్ ఒరిజినల్ టీసీ, 2026 ఏప్రిల్ 1 తర్వాత తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, అలాగే ఇతర అవసరమైన సర్టిఫికెట్లను సమర్పించాలని లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి సూచించారు. విద్యార్థులు చివరి తేదీల వరకు వేచి ఉండకుండా ముందుగానే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యం: కూనంనేని

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బీజేపీపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ మతపరమైన విభజన, మతం అనే సౌధంపై నిలబడి ఉందని తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే ఇక్కడ వారు కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం మాత్రం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందువల్ల సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

# పార్ట్‌టైం అధ్యాపకులకు కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలు అమలు చేయాలి

**ఉద్యోగ భద్రతతో పాటు రూ.50 వేల కనీస వేతనం కల్పించాలని డిమాండ్**


**హన్మకొండ, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ ప్రభుత్వ, అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పార్ట్‌టైం అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రంకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. విశ్వవిద్యాలయ పరిధిలో సుమారు 165 మంది పార్ట్‌టైం అధ్యాపకులు వివిధ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారని, గత రెండు దశాబ్దాలుగా తక్కువ వేతనాలతో ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటూ విద్యార్థులకు బోధన అందిస్తున్నారని వారు తెలిపారు. పార్ట్‌టైం అధ్యాపకులు మాట్లాడుతూ, తెలంగాణలోని విశ్వవిద్యాలయాల విద్యా వ్యవస్థ కొనసాగడంలో తమ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే తమ సేవలకు తగిన గుర్తింపు, భద్రత, వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సెమిస్టర్ ప్రాతిపదికన మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని, సంవత్సరంలో ఆరు నెలలకే జీతాలు అందుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పార్ట్‌టైం అధ్యాపకులకు నెలకు రూ.50 వేల వేతనం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేస్తూ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు కనీసం రూ.50 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విశ్వవిద్యాలయాల విద్యా ప్రమాణాల పెంపుదలలో పార్ట్‌టైం అధ్యాపకుల సేవలు ఎంతో కీలకమని, వారి సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐలేశ్వర్, డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ చల్లా శ్రీనివాస్, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ వావిళ్ల కుమారస్వామి, డాక్టర్ బి. నవీన్, డాక్టర్ రవీందర్ (ఎకనామిక్స్) తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సామాజిక న్యాయంపై వైరల్ చర్చ.. సోషల్ మీడియాలో ప్రశ్నల వెల్లువ

**హైద్రాబాద్, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




కాంగ్రెస్ పార్టీ ప్రస్తావిస్తున్న సామాజిక న్యాయం, బహుజన ప్రాతినిధ్యం అంశాలపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బహుజన వర్గాల విద్య, ఉద్యోగాలు, కుల గణన, సామాజిక న్యాయం వంటి అంశాలపై చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో రాజకీయ అధికారంలో బహుజనుల ప్రాతినిధ్యంపై నెటిజన్లు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పదవులు చేపట్టిన నాయకుల సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ, "బహుజనులకు హక్కులు, అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ చెబుతోంది. అయితే అత్యున్నత రాజకీయ పదవుల్లో వారికి ఎంత మేర ప్రాధాన్యత ఇస్తోంది?" అనే ప్రశ్నలు సోషల్ మీడియా వేదికలపై వైరల్ అవుతున్నాయి. విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని కాంగ్రెస్ తరచూ ప్రస్తావిస్తోందని, అయితే రాజకీయ అధికార భాగస్వామ్యంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉందని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. బహుజన వర్గాలకు కేవలం సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు మాత్రమే కాకుండా, నిర్ణయాత్మక పదవుల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు, సామాజిక న్యాయం సాధన కోసం కాంగ్రెస్ కట్టుబడి పనిచేస్తోందని, కుల గణన, రిజర్వేషన్ల పరిరక్షణ, వెనుకబడిన వర్గాల సాధికారత వంటి అంశాలపై పార్టీ స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోందని కాంగ్రెస్ అనుచరులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "సామాజిక న్యాయం అంటే కేవలం విద్య, ఉద్యోగ అవకాశాలకే పరిమితమా? లేక రాజకీయ అధికారంలోనూ సమాన భాగస్వామ్యం ఉండాలా?" అనే అంశంపై సోషల్ మీడియాలో విస్తృత స్థాయిలో చర్చ జరుగుతోంది. రాజకీయ విశ్లేషకులు, సామాజిక వేత్తలు, నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకుంటూ ఈ అంశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు.

## విశ్వబ్రాహ్మణ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హన్మకొండ, 01 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అందజేసే ప్రతిభా పురస్కారాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వోపా అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజారావు పిలుపునిచ్చారు. హనుమకొండ రెడ్డి కాలనీలోని వోపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. 2026 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులు మాత్రమే ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు మార్కుల మెమో, బోనాఫైడ్ లేదా కండక్ట్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను ఈ నెల 10వ తేదీలోపు 9440313745 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. గడువులోగా అందిన దరఖాస్తులను పరిశీలించి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, శాలువాతో ఘన సత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతిభా పురస్కారాల ఎంపికలో కమిటీ నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థుల వివరాలు, పురస్కారాల ప్రదానోత్సవ తేదీ, వేదిక తదితర అంశాలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వోపా రాష్ట్ర ముఖ్య సలహాదారు చోల్లేటి కృష్ణమాచార్యులు, ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు సంగోజు మోహన్, ఉపాధ్యక్షుడు ఆకోజు సురేందర్‌రావు, కోశాధికారి శ్రీరామోజు వెంకటేశ్వర్లు, బాధ్యులు శ్రీరామోజు నాగసోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను సవరించాలని భద్రాద్రిలో క్రైస్తవుల ర్యాలీ**




**భద్రాద్రి కొత్తగూడెం, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ. డాక్టర్ ఎం. జాన్ విల్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా ఇన్‌చార్జి రెవ. పాస్టర్ పి. నెహెమ్యా, వివిధ మండలాల ఫెలోషిప్ నాయకులు, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్వంచ ఆర్‌సీఎం చర్చ్ నుండి దమ్మపేట సెంటర్ వరకు ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. మతం మారినంత మాత్రాన కులం మారదని, దళిత క్రైస్తవులకు కూడా రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛను పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా క్రైస్తవ హక్కుల రక్షణ సమితి వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు బిషప్ డాక్టర్ జన్ను యిర్మీయా మాట్లాడుతూ, దళిత క్రైస్తవులకు సామాజిక న్యాయం అందించాలంటే 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టు తీర్పును పునర్విమర్శించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఐసీఎఫ్ జాతీయ అధికార ప్రతినిధి రెవ. డాక్టర్ బిషప్ ఏ.జే. సామ్యూల్ మాట్లాడుతూ, జైనులు, సిక్కులకు గతంలో కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. టీయూసీపీఏ రాష్ట్ర కార్యదర్శి గొనె సల్మాన్ మాట్లాడుతూ, దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవ. డాక్టర్ ఎం. జాన్ విల్సన్ మాట్లాడుతూ, క్రైస్తవుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని, సమానత్వ సూత్రాలను అమలు చేయాలని, దళిత క్రైస్తవుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో జిల్లా, మండల స్థాయి క్రైస్తవ నాయకులు, పాస్టర్లు, మహిళలు, యువకులు, క్రైస్తవ సహోదర, సహోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 పోస్టర్ ఆవిష్కరణ

**పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్లు**

**హన్మకొండ, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు కుడా కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యం వల్ల ఏర్పడుతున్న దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీలు, వీధి నాటకాలు, చర్చా వేదికలు, అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా పర్యావరణ స్పృహను మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఏక వినియోగ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, గాజు మరియు స్టీల్ బాటిళ్లు, విస్తర్లు వంటి పునర్వినియోగ ఉత్పత్తులను ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. స్వచ్ఛమైన, హరితమైన పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని ఆమె కోరారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి ఎస్. శ్రీనివాస స్వామి, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జోనల్ ప్రయోగశాల పర్యావరణ శాస్త్రవేత్త జీమూత వాహన్ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

**బేషరతుగా క్షమాపణ చెప్పాలి: భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి**



**కీసర, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ హైదరాబాద్ జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు 96వ జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి భిక్షపతి మాట్లాడుతూ, సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చరిత్ర తెలియనివారు చరిత్రను సృష్టించలేరని పేర్కొంటూ, సమాజ అభివృద్ధి కోసం ఎన్నో తరాలుగా మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలను గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. గౌతమ బుద్ధుని సామ్యవాద భావజాలం, మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా ఉద్యమం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం వల్లే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, వికలాంగులు, మహిళలు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం పొందారని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాల ద్వారా నేడు అనేక మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. అయితే కొందరు సౌకర్యాలు, పదవులు వచ్చిన తర్వాత తమ మూలాలను, మహనీయుల త్యాగాలను మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కృతజ్ఞత లేని సమాజం ఎక్కువ కాలం స్వేచ్ఛగా మనుగడ సాగించలేదని, సామాజిక బాధ్యతలను గుర్తుంచుకుంటూ రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభ్యున్నతికి కూడా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు కొయ్యడ అయిలయ్య, రమణారెడ్డి, సంగం కృష్ణ, గాదె రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల విలువలను తుంగలో తొక్కుతున్న నకిలీ రిపోర్టర్లు



**కీసర, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

జర్నలిస్టుల పేరుతో కొందరు వ్యక్తులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతూ మీడియా వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎ.ఐ.ఎఫ్.టి.యూ) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ జర్నలిస్టుల వ్యవహారాలపై జవహర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టులకు ఉన్న విశ్వసనీయతను కొందరు దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యల వల్ల నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల ప్రతిష్ఠ దెబ్బతింటోందని పేర్కొన్నారు. నకిలీ జర్నలిస్టులపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుని మీడియా రంగం గౌరవాన్ని కాపాడాలని కోరారు. జై భీమ్ టీవీ రిపోర్టర్ గాదె రమేష్ మాట్లాడుతూ, జర్నలిజం అనేది ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతాయుతమైన వృత్తి అని అన్నారు. సమాజ ప్రయోజనాల కోసం పనిచేసే మీడియా వేదికలను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. జర్నలిజం పేరుతో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘ నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలను అరికట్టేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు.

# కీసర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మల్కాజ్‌గిరి సీపీ సుమతి

**కీసర, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ సోమవారం కీసర పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అక్కడి నిర్వహణ, సేవల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు, రికార్డుల నిర్వహణ, వివిధ విభాగాల కార్యకలాపాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం క్రైమ్ విభాగం, రిసెప్షన్, ఇతర విభాగాల సిబ్బందితో మాట్లాడిన సీపీ, వారి విధుల నిర్వహణపై ఆరా తీశారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించిన సీపీ సుమతి, అక్కడి పరిశుభ్రత, పచ్చదనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విభాగాల ఇన్‌చార్జిలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి విధుల నిర్వహణలో మరింత చురుకుదనం ప్రదర్శించాలని ఆదేశించారు. సాంకేతిక యాప్‌ల వినియోగం, ఎన్‌పీడీఎస్ కేసుల దర్యాప్తు, మీ సురక్ష అప్లికేషన్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించడం వంటి అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్‌ఐలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించాలి

**ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి ప్రజలు వ్యక్తిగతంగా సమర్పించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నందున ప్రతి వినతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, వినతులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సత్వర పరిష్కారం అందించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భూ సంబంధిత సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ, పింఛన్లు, ఉపాధి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 227 వినతులు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ప్రజలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నిబద్ధత, అంకితభావంతో పనిచేసిన ఉద్యోగి అందరి అభిమానాన్ని పొందగలడు: వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి

**హన్మకొండ, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించిన ఉద్యోగి అందరి అభిమానాన్ని పొందగలడని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో మే 31న ఉద్యోగ విరమణ చేసిన వైస్ ఛాన్సలర్ లాడ్జ్ కార్యాలయ సబ్‌ఆర్డినేట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్‌కు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజానికి ఆదర్శంగా నిలిచే విధంగా ఉద్యోగులు తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ పనిపట్ల నిబద్ధత, క్రమశిక్షణ, విధేయతను అలవర్చుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. దీర్ఘకాలంగా విశ్వవిద్యాలయానికి సేవలందించిన మహమ్మద్ రాజ్ మహమ్మద్ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. అనంతరం మహమ్మద్ రాజ్ మహమ్మద్‌తో పాటు ఆయన సతీమణిని శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, ఆహ్వానితులు పాల్గొన్నారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజు వల్లాల కార్యక్రమానికి సంయోజకులుగా వ్యవహరించారు.



# జిల్లా, డివిజన్ స్థాయిల ప్రజావాణిలో 173 దరఖాస్తులు స్వీకరణ

**వినతులను త్వరితగతిన పరిష్కరించి పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజల సౌకర్యార్థం జిల్లా, డివిజన్ స్థాయిలలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా, డివిజన్ స్థాయిలలో మొత్తం 173 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిలో జిల్లా స్థాయిలో 140 దరఖాస్తులు, వరంగల్ డివిజన్‌లో 22, నర్సంపేట డివిజన్‌లో 11 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు 70, మున్సిపల్ శాఖకు 32, హౌసింగ్ శాఖకు 14 దరఖాస్తులు రాగా, మిగిలిన 57 దరఖాస్తులు ఇతర శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే పరిష్కరించిన వినతుల వివరాలను ప్రజావాణి పోర్టల్‌లో వెంటనే అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీఎంఅండ్‌హెచ్‌వో సాంబశివరావు తదితర అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయితో పాటు డివిజన్ స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహించడం వల్ల ప్రజలకు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తోందని అధికారులు తెలిపారు. ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి సమస్యల పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

# పవన్ కల్యాణ్‌కు తెలంగాణతో ఏం పని?: అనిరుధ్ రెడ్డి


**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన... అసలు పవన్ కల్యాణ్‌కు తెలంగాణతో ఏం పని? అంటూ సూటిగా ప్రశ్నించారు. ఇటీవల పవన్ కల్యాణ్ తెలంగాణను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, రాజకీయ కార్యకలాపాలను కాంగ్రెస్ నేత తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా రాజకీయ పార్టీలు పెట్టుకునే, నడుపుకునే హక్కు ఉంటుందని అంగీకరిస్తూనే... పక్క రాష్ట్రాల నాయకులు వచ్చి తెలంగాణపై ద్వేషాన్ని, ప్రతికూలతను వ్యాప్తి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య ఇంకా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల విభజన అంశాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా పనిచేస్తున్న తెలంగాణ ప్రాంత ఉద్యోగులు తీవ్ర వివక్షకు, వేధింపులకు గురవుతున్నారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు.

# భీమదేవరపల్లిలో బెల్ట్ షాపులకు చెక్

**గ్రామ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు కోసం ఏకగ్రీవ తీర్మానం**

**భీమదేవరపల్లి, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




గ్రామ ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని భీమదేవరపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించాలని సోమవారం జరిగిన గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ, గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల మద్యం వినియోగం పెరిగి అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత మద్యం వ్యసనానికి గురై వారి భవిష్యత్తు దెబ్బతింటోందని పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు కూడా బెల్ట్ షాపుల కారణంగా గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామాన్ని మద్యరహితంగా మార్చేందుకు ప్రజలు కూడా సహకరించాలని, అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం అందించాలని కోరారు..సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సు కూడా గ్రామపంచాయతీ బాధ్యతేనని అన్నారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య మాట్లాడుతూ, యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంతో పాటు కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ నిర్ణయం కీలకంగా మారుతుందని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, గ్రామ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, పోలు అశోక్, సాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు గ్రామస్తులు స్వాగతించారు.

# తెలంగాణ ఉద్యమకారుల సేవకు మరింత అంకితభావంతో పనిచేస్తా: కనుకుంట్ల సతీష్

**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కార్యదర్శిగా నియామకం**

**హసన్‌పర్తి, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కార్యదర్శిగా కనుకుంట్ల సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు భాషబోయిన రవీందర్ యాదవ్ నియామక పత్రాన్ని సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో కనుకుంట్ల సతీష్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నియామక పత్రాన్ని అందుకున్న కనుకుంట్ల సతీష్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఫోరం ద్వారా నిరంతరం పనిచేస్తానని అన్నారు. ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సంస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు భాషబోయిన రవీందర్ యాదవ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిలువేరు రమేష్‌లకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొని కనుకుంట్ల సతీష్‌కు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఉద్యమకారుల హక్కుల సాధన, సంక్షేమం కోసం మరింత చురుకుగా పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు.

# మెడికవర్ ఆసుపత్రిలో 61 ఏళ్ల వ్యక్తికి ఎపెండిమోమా స్పైనల్ కార్డ్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**


గత కొన్ని నెలలుగా ఎడమ చేయి నొప్పి, తిమ్మిరితో బాధపడుతున్న 61 ఏళ్ల గోపాల్ రెడ్డికి మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్లు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి, కొత్త జీవితాన్ని ప్రసాదించారు. బెంగళూరు నగరంలోని వైట్ ఫీల్డ్ మెడికవర్ ఆసుపత్రికి ఆ రోగి ఎడమ చేయి నొప్పితో వచ్చారు. అవసరమైన వైద్య పరీక్షలు, స్కానింగ్ అనంతరం, వైద్యులు అతనికి మెడ మరియు పై వెన్నుపాము (సి6-డి1)లో ఎపెండిమోమా స్పైనల్ కార్డ్ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో, వారు తక్షణ శస్త్రచికిత్స చేయాలని సూచించి, వాస్తవాలను రోగి బంధువులకి వివరించారు. అప్పుడు, మెడికవర్ ఆసుపత్రి సీనియర్ న్యూరో సర్జన్ మరియు స్పైనల్ సర్జన్ అయిన డాక్టర్ ఆనంద్ వి.కె. నేతృత్వంలో, డాక్టర్ యశ్వంత్‌తో కలిసి, "సి6-డి1 ఎపెండిమోమా స్పైనల్ కార్డ్ ట్యూమర్ ఎక్సిషన్" అనే క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం, రోగికి అవసరమైన చికిత్స, యాంటీబయాటిక్స్ మరియు సహాయక మందులు అందించడంతో అతని ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉండటంతో వైద్యులు అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ విషయంపై డాక్టర్ ఆనంద్ వి.కె మాట్లాడుతూ, "వెన్ను కణితులను తొలిదశలోనే గుర్తిస్తే విజయవంతంగా చికిత్స చేయవచ్చు. నొప్పి, తిమ్మిరి, చేతులలో బలహీనత వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణుడిని సంప్రదించడం చాలా ముఖ్యం" అని అన్నారు. ఈ శస్త్రచికిత్స పట్ల ఆసుపత్రి ప్రాంతీయ అధిపతి కె. సిద్ధారెడ్డి, పరిపాలనా అధికారి జి. కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు.




# ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజావాణి ఎందుకు?

**సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ ప్రశ్న**

**హసన్‌పర్తి, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**


GRIEVANCE CELL
HNK/2026/2537 WOUDC/E/2026
Forwarded to DBCWO for taking necessary action as per rule.
for DISTRICT COLLECTOR, HANUMAKONDA.
20/4/26

గౌరవనీయులైన కలెక్టర్ గారికి నమస్కరించి తెలియజేయునది ఏమనగా

విషయము: 2024-25 లో (రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ) బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కరాటే నేర్పుటకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు అధికారులు. జిల్లా కలెక్టర్ గారు మరియు DEO. అధికారులు కలిసి వివిధ స్కూళ్లకు కరాటే నేర్పుటకు ఆయా మండలాల కరాటే మాస్టర్ లను గుర్తించి ప్రణాళిక ప్రకారం అన్ని స్కూళ్లలో కరాటే మాస్టర్స్ జాయిన్ అయినారు అదే క్రమంలో నేను కూడా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ లోగల MJP క్రమ సంఖ్య 1676. మండలం కోడు 361205 .వర్ధన్న పేట స్కూలు కోడు 36120500313 మరియు MJP క్రమ సంఖ్య 1729. మండలం కోడు 361208. హనుమకొండ స్కూల్ కోడు 36120890821 లకు సంబంధించి. ప్రభుత్వ ఆదేశాల మేరకు. స్కూల్ ప్రిన్సిపాల్ అనుమతులతో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ మూడు నెలల శిక్షణ తరగతులు పూర్తయినాయి మార్చి 31 లోగా కరాటే మాస్టర్ ఒక్క స్కూల్ కు 15000 చొప్పున రెండు స్కూళ్లకు=30.000. స్కూల్ అకౌంట్లో నుండి డ్రా చేసి కరాటే మాస్టర్ కు డబ్బులు ఇవ్వవలసి ఉండే ఈ రెండు స్కూల్లో ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్ల కరాటే మాస్టర్ దుర్గాప్రసాద్. అయిన నాకు ఇవ్వవలసిన డబ్బులు తిరిగి ట్రెజరీకి వెళ్లిపోవడం జరిగింది (స్కూల్ ప్రిన్సిపాల్ అయినా వీరికి

2537

PRAJAVANI ACKNOWLEDGEMENT RCECEIPT
HANUMAKONDA DISTRICT

| | |
|---|---|
| DATE | : 20/04/2026 11:34:37 |
| REGISTRATION NO | : HNK/2026/02537 |
| NAME | : R DURGAPRASAD |
| MOBILE NO | : 9704357841 |
| ADDRESS | : ELLAPUR, HASANPARTHY |
| VILLAGE | : HASANPARTHY |
| MANDAL | : HASANPARTHY |
| GRIEVANCE SUBJECT | : AMOUNT ISSUE |
| GRIEVANCE FORWARDED TO | : DISTRICT BC WELFARE OFFICER |

YOUR GRIEVANCE IS REGISTERED VIDE REGISTRATION NO. HNK/2026/02537 On 20-04-2026. PLEASE KEEP THE REGISTRATION NUMBER FOR ALL FUTURE CORRESPONDENCE.

THANKS FOR THE REGISTRATION!

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వినతులు సమర్పించినప్పటికీ వాటికి పరిష్కారం లభించకపోతే ప్రజావాణి నిర్వహణ ఉద్దేశమేంటని సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ ప్రశ్నించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ఆయన, గతంలో సమర్పించిన తన వినతికి ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో మండే ఎండలను సైతం లెక్కచేయకుండా దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్నారని, అయితే సంబంధిత అధికారులు స్పందించకపోవడం వల్ల నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సమస్యను వివరించారు. ఎల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఎంజేపీ పాఠశాలలు, వర్ధన్నపేట, హనుమకొండ బాలికల పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ కోసం కరాటే శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడిగా తాను మూడు నెలలపాటు సేవలందించినప్పటికీ, తనకు చెల్లించాల్సిన పారితోషికం ఇప్పటికీ అందలేదని తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మార్చి 31లోపు బిల్లులు డ్రా చేసి చెల్లింపులు చేయాల్సి ఉండగా, నిర్లక్ష్యం కారణంగా ఆ నిధులు తిరిగి ప్రభుత్వ ట్రెజరీకి వెళ్లిపోయాయని ఆరోపించారు. ఈ విషయమై ఏప్రిల్ 20న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత అధికారులకు దరఖాస్తు ఫార్వర్డ్ చేయడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సంవత్సరం గడిచినా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో మరోసారి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రవికి వినతి సమర్పించినట్లు తెలిపారు. కనీసం సంబంధిత అధికారులను పిలిచి విచారణ జరపాలని కోరినా స్పందన లభించలేదని అన్నారు. ప్రభుత్వ ట్రెజరీలో నిధులు అందుబాటులో లేవనే కారణంతో అధికారులు చేతులు ఎత్తేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రజావాణిలో సమర్పించే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని, లేకపోతే ప్రజావాణి కార్యక్రమం నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ప్రజల సమస్యల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించి, ప్రజావాణిలో వచ్చిన వినతులను నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ కోరారు.

# హసన్‌పర్తిలో మహిళ అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

**15 రోజులుగా ఆచూకీ లేక కుటుంబ సభ్యుల ఆందోళన**
**సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి**

**హసన్‌పర్తి, 31 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



హసన్‌పర్తి గ్రామానికి చెందిన ఓ మహిళ అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గత 15 రోజులుగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు హసన్‌పర్తి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి గ్రామానికి చెందిన తోటం స్వప్న (40), భర్త దివంగత భాస్కర్, ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదు. స్వప్న తండ్రి అమంచ రాజేందర్ (72) ఆదివారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మే 25న పొరుగువారి ద్వారా సమాచారం అందడంతో కుమార్తెకు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5.5 అడుగులు ఉండగా, తెలుపు రంగు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎడమ చేతిపై భాస్కర అనే టాటూ, కుడి చేతిపై త్రిశూల్ టాటూ గుర్తులుగా ఉన్నాయని వెల్లడించారు. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు హసన్‌పర్తి పోలీసులు తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా గుర్తించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సంప్రదించాల్సిన నంబర్లు ఇన్‌స్పెక్టర్ 8712685124 ఎస్ఐ 8712685097, 8712685098, ఎస్‌హెచ్ఓ 8712685015. మహిళ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# నిరుపేదలకు నిలువ"నీడా" వసతులు.

**పేద ప్రజల వినతులకు ప్రాధాన్యతనిస్తున్న ప్రజా నాయకులు,అధికారులు.**
**ప్రజాసేవను పెంపొందించడమే ప్రధాన లక్ష్యం.**
**నిరుపేద కుటుంబాల అంతిమ సంస్కారాల కోసం ప్రత్యేక వసతుల ఏర్పాటుకు చర్యలు.**



**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

నిలువ నీడలేని పేదలను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన పశ్చిమ ఎమ్మెల్యే ,హన్మకొండ జిల్లా కలెక్టర్ కుడా చైర్మన్,ఉన్నత అధికారులను అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనిత రెడ్డి మనస్ఫూర్తిగా అభినందించారు.పేద ప్రజలకు గూడు ఏర్పాటు చేయడం కోసం ప్రజాపాలకులు సహకరిస్తుండడం అభినందనీయం అన్నారు.అందులో భాగంగానే పద్మాక్షి శివ ముక్తి ధామ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని, కుడా చైర్మన్,కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ , కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి, అధికారులు.హనుమకొండ సుదూర ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వరంగల్ మహానగరానికి వచ్చి కిరాయి ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోయిన సమయంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమస్యను గుర్తించిన అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి విషయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో నేడు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,కూడా సంబంధిత అధికారులతో కలిసి పద్మాక్షి శివ ముక్తి ధామ్ స్థలాన్ని పరిశీలించారు. నిరుపేదలు, వలస కార్మిక కుటుంబాలు తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పుల్లూరి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవావేత్త డాక్టర్ అనితా రెడ్డి, పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొని తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , హన్మకొండ జిల్లా కలెక్టర్ కు అధికారులకు డాక్టర్ అనితా రెడ్డి కృతజ్ఞతలు తెలియ చేసారు ఈ వసతులు అందుబాటులోకి వస్తే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుందని, తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఎన్.మూర్తి, మహేంద్ర కపూర్, అధికారులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా

# వరంగల్ పోలీసులకు సేవా పతకాల గౌరవం

**ముగ్గురు అధికారులకు ఉత్తమ సేవా పతకాలు.. 19 మంది పోలీసు సిబ్బందికి సేవా పతకాలు**

**వరంగల్, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలతో సత్కరించనుంది. ఈ మేరకు ముగ్గురు పోలీసు అధికారులను ఉత్తమ సేవా పతకాలకు, 19 మంది పోలీసు అధికారులను సేవా పతకాలకు ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎం.డి. షర్ఫుద్దీన్ (ఏఆర్ఎస్ఐ, సీఏఆర్), పి. వెంకట్‌రెడ్డి (ఏఎస్ఐ, సీఎస్‌బీ), పి. మల్లారెడ్డి (ఏఆర్ఎస్ఐ) ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. అలాగే సేవా పతకాలకు బి. రాజాగోపాల్, కె. సుజాత, ఎ. రాఘవేందర్, వి. క్రాంతికుమార్, పి. స్పార్జన్ రాజ్, పి. శ్రీనివాస్ రాజు, అబ్దుల్ కరీం, కె. నరసింహారెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, కె. మల్లికార్జున్, ఎం.డి. ఉస్మాన్, ఈ. శ్రీనివాస్, కె. నరసింహారావు, ఆర్. రవీందర్, కె. మనోహర్, ఎ. తిరుపతిరావు, ఎం. బిక్షపతి, ఎ. యాకయ్య, ఎన్. జనార్ధన్ ఎంపికయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా సేవలు, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినందుకు వీరిని ఈ ప్రతిష్ఠాత్మక పతకాలకు ఎంపిక చేసినట్లు పోలీసు శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లభించిన ఈ గౌరవం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు గర్వకారణమని, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. పతకాలకు ఎంపికైన పోలీసు అధికారులు, సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా



# తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు హనుమకొండ సిద్ధం





**అమరవీరుల త్యాగస్ఫూర్తికి ఘన నివాళి**
**నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**హన్మకొండ, 1 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ 12వ వార్షికోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముందుగా ఉదయం హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి అమరవీరులకు నివాళులర్పించనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ప్రారంభిస్తారు. జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన అనంతరం పరేడ్‌ను పరిశీలించి జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగించనున్నారు. అలాగే పరేడ్ మార్చ్‌పాస్ట్, తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, రాష్ట్ర సాధన ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థులు, కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రి సందర్శించి పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలంగాణ ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌ను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి వేళల్లో కలెక్టరేట్ భవనం విద్యుత్ కాంతులతో వెలుగులు విరజిమ్ముతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కలెక్టరేట్ ఆవరణలో ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు కట్టుబడి బంగారు తెలంగాణ నిర్మాణ దిశగా ముందుకు సాగాలనే సంకల్పంతో జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం



**ఉద్యమ చరిత్రలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల పోరాట పటిమ**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 2న ఘనంగా జరుపుకుంటారు. 2014 జూన్ 2న భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. ఇది కేవలం ఒక రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు . దశాబ్దాల పాటు సాగిన ప్రజా ఉద్యమం, విద్యార్థుల త్యాగాలు, మేధావుల పోరాటాలు, రైతుల ఆకాంక్షలు, ఉద్యోగుల ఆవేదనల సమ్మేళనం. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక వేలాది మంది అమరుల త్యాగాలు, లక్షలాది మంది ప్రజల ఆశయాలు దాగి ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయము, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థుల పాత్ర చిరస్మరణీయమైనది.

**తెలంగాణ ఉద్యమానికి పునాది**

1956లో ఆంధ్ర రాష్ట్రం , హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతం కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. అయితే కాలక్రమేణా తెలంగాణ ప్రాంత ప్రజలు తమకు విద్య, ఉద్యోగాలు, సాగునీరు, నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందనే భావనకు వచ్చారు. “నీళ్లు -- నిధులు -- నియామకాలు” అనే నినాదం తెలంగాణ ఉద్యమానికి ప్రధాన అజెండాగా మారింది. ఈ అసంతృప్తి 1969 తెలంగాణ ఉద్యమానికి దారితీసింది. అనంతరం వివిధ దశల్లో ఉద్యమం కొనసాగి 2000లలో మరింత ఉధృతమైంది.

**ఉస్మానియా విశ్వవిద్యాలయం - ఉద్యమానికి అగ్నికుండం**

తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడినప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ప్రస్తావించకుండా ఉండలేం. ఉస్మానియా క్యాంపస్ తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచింది. విద్యార్థులు తరగతి గదులను విడిచి ఉద్యమ బాట పట్టారు. అనేక సమావేశాలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యమాన్ని గ్రామాల వరకు తీసుకెళ్లారు. విద్యార్థుల నినాదాలు తెలంగాణ ప్రజల మనసుల్లో చైతన్యం నింపాయి. తెలంగాణ సాధన కోసం అనేక మంది విద్యార్థులు ఆత్మాహుతులు చేసుకోవడం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ తెలంగాణ ఉద్యమానికి చారిత్రాత్మక వేదికగా మారింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించిందని పలు చారిత్రక విశ్లేషణలు అనేకము

**కాకతీయ విశ్వవిద్యాలయం - ఉత్తర తెలంగాణ గళం**

కాకతీయ యూనివర్సిటీ కూడా తెలంగాణ ఉద్యమంలో కీలక కేంద్రంగా నిలిచింది. వరంగల్ ప్రాంతం చారిత్రాత్మకంగా పోరాటాల గడ్డగా ప్రసిద్ధి చెందింది. కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తెలంగాణ సాధన కోసం పెద్దఎత్తున ర్యాలీలు, బంద్‌లు, నిరసనలు చేపట్టారు. గ్రామీణ తెలంగాణ యువతలో ఉద్యమ స్ఫూర్తిని నింపడంలో ఈ విశ్వవిద్యాలయం ప్రముఖ పాత్ర పోషించింది. విద్యార్థి నాయకులు గ్రామాలకు వెళ్లి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అవసరాన్ని వివరించారు. ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రైతు సంఘాలతో కలిసి ఉద్యమాన్ని బలోపేతం చేశారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాలు ఉద్యమానికి ప్రధాన కేంద్రాలుగా మారాయి.

**విద్యార్థి సంఘాల పెన్‌డౌన్ ఉద్యమం**

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి సంఘాలు అనేక వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. వాటిలో “పెన్‌డౌన్” ఉద్యమం ఒకటి. విద్యార్థులు తమ విద్యా కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటంలో పాల్గొన్నారు. పెన్ను పక్కనపెట్టి ఉద్యమానికి అంకితం కావడం ద్వారా తెలంగాణ యువత తమ నిబద్ధతను చాటిచెప్పింది. పెన్‌డౌన్ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో తరగతులు నిలిచిపోయాయి. విద్యార్థులు తమ భవిష్యత్తుకన్నా తెలంగాణ భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ఉద్యమాలు తెలంగాణ ప్రజల్లో మరింత చైతన్యాన్ని కలిగించాయి.

**మిలియన్ మార్చ్ - తెలంగాణ ఉద్యమ చరిత్రలో మహాఘట్టం**

2011 మార్చి 10న నిర్వహించిన “మిలియన్ మార్చ్” తెలంగాణ ఉద్యమ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన సంఘటనగా నిలిచింది. లక్షలాది మంది ప్రజలు హైదరాబాద్ వైపు తరలివచ్చి తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను ప్రపంచానికి చాటిచెప్పారు. విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులు మిలియన్ మార్చ్ విజయానికి ప్రధాన శక్తిగా నిలిచారు. అనేక అడ్డంకులు, ఆంక్షలు, అరెస్టులు ఎదురైనా వారు వెనుకడుగు వేయలేదు. మిలియన్ మార్చ్ తెలంగాణ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చింది

**ఉద్యోగ సంఘాలు - ప్రజా సంఘాల సహకారం**


తెలంగాణ ఉద్యమం కేవలం రాజకీయ నాయకుల ఉద్యమం కాదు. ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, మహిళా సంఘాలు అందరూ ఉద్యమంలో భాగమయ్యారు. “సకల జనుల సమ్మె” వంటి కార్యక్రమాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపజేశాయి. తెలంగాణ ప్రజల ఐక్యత ఉద్యమ విజయానికి ప్రధాన కారణమైంది.

**అమరుల త్యాగాలు**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వందలాది మంది యువకులు, విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారు. వారి త్యాగాలు ఉద్యమానికి మరింత బలం చేకూర్చాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం అమర వీరులకు నివాళులు అర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా అమరుల స్ఫూర్తిని స్మరించుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం**

దీర్ఘకాల పోరాటాలు, నిరసనలు, ఉద్యమాల ఫలితంగా భారత పార్లమెంట్ తెలంగాణ రాష్ట్ర బిల్లును ఆమోదించింది. అనంతరం 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం అధికారికంగా ఏర్పడింది. ఈ రోజు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ విజయదినంగా చరిత్రలో నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అమరుల స్మరణ సభలు నిర్వహిస్తారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం అనేది కేవలం ఒక పండుగ కాదు అది ఒక చారిత్రాత్మక పోరాటానికి ప్రతీక. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉద్యమానికి ప్రాణం పోశారు. పెన్‌డౌన్ ఉద్యమాలు, మిలియన్ మార్చ్, విద్యార్థి సంఘాల నిరంతర పోరాటం తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేశాయి. అమరుల త్యాగాలు, విద్యార్థుల సంకల్పం, ప్రజల ఐక్యత వల్లే తెలంగాణ కల సాకారమైంది. అందుకే ప్రతి తెలంగాణ వాసి జూన్ 2ను గర్వంగా, ఆత్మగౌరవంతో, అమరుల స్మృతిని స్మరించుకుంటూ జరుపుకుంటాడు. జై తెలంగాణ -- అమరుల ఆశయాల తెలంగాణ!




# టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సులలో ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహణ

**పోషకాహార అవగాహనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయి: డీఈఓ ఎల్.వి. గిరిరాజ్ గౌడ్**





**హన్మకొండ, 1 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్, ప్రాక్టీసింగ్ స్కూల్‌లో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టిటిసి) కోర్సుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు తమ ప్రాంతాల సంప్రదాయ వంటకాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, పోషక విలువలు కలిగిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన డీఈఓ ప్రతి వంటకం ప్రత్యేకత, అందులోని పోషక విలువల గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణార్థుల సృజనాత్మకతను, వంటకాల ప్రదర్శనను అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక, మానసిక వికాసంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల పెంపుదలపై కూడా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సులు ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఎం.ఎడ్, పీహెచ్‌డీ అర్హతలతో పాటు సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, మెథడాలజీ, ట్రైనింగ్ అండ్ ఎవాల్యుయేషన్ వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా బోధన అందించగలరని పేర్కొన్నారు. ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా శిక్షణార్థులు డీఈఓకు ప్రత్యేక జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, శిక్షణార్థులతో కలిసి ఆయన ఫోటోలు దిగారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ ప్రాంతీయ వంటకాల విశిష్టతను వివరిస్తూ వాటి పోషక ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమం ముగింపులో శిక్షణార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కలిసి స్మారక ఫోటోలు దిగారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా ఉపాధ్యాయుల మధ్య పరస్పర అనుబంధం పెరగడంతో పాటు పోషకాహారంపై అవగాహన మరింత విస్తరించిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, టిటిసి కోర్సు శిక్షణార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులను డీఈఓ అభినందించారు.

# ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తున్న “ఫిజిక్స్ వాలా “ ను వెంటనే మూసివేయాలి- ఎస్ఎఫ్ఐ డిమాండ్

**ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలకు కొమ్ముకాస్తున్న డీఐఈవోను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం**

**హన్మకొండ / జై భీమ్ న్యూస్ :**



హన్మకొండ నగరంలోని నక్కలగుట్ట ప్రాంతంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అకాడమీ పేరుతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఫిజిక్స్ వాలా ప్రైవేట్ విద్యా సంస్థను వెంటనే మూసివేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు.దహన్మకొండ జిల్లా కలెక్టర్ చౌహాన్ బాజ్‌పాయ్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ, నక్కలగుట్టలో ఫిజిక్స్ వాలా పేరుతో ప్రైవేట్ విద్యా సంస్థను ఏర్పాటు చేసి, నగర వ్యాప్తంగా భారీ హోర్డింగ్స్ ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమంగా ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేపడుతున్నారని ఆరోపించారు. ఇంటర్మీడియట్ బోర్డుతో ఎలాంటి అనుబంధం లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను చేర్చుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కళాశాలకు సరైన భవనం కూడా లేకుండా ఒక ఇంట్లోనే సంస్థను నిర్వహిస్తూ అడ్మిషన్లు చేపడుతున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఫిజిక్స్ వాలా విద్యా వ్యాపారం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి (డీఐఈవో) స్పందించకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలలకు విద్యాశాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ఫిజిక్స్ వాలా విద్యా సంస్థపై విచారణ జరిపి, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి సంస్థను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. అలాగే ఈ వ్యవహారంపై బాధ్యత వహించాల్సిన డీఐఈవోపై చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రభుత్వం స్పందించకపోతే ఫిజిక్స్ వాలా కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మంద శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, నాగరాజ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్**



**మేడ్చల్ / జై భీమ్ న్యూస్ :**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాజీనగర్‌లో ఆదివారం అంబేద్కర్ మహనీయులకు 96వ జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి భిక్షు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చరిత్ర తెలియనివారు చరిత్రను సృష్టించలేరని పేర్కొన్న ఆయన, వందల ఏళ్లుగా అణగారిన వర్గాల కోసం మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గౌతమ బుద్ధుని సమానత్వ భావన, మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన విద్యా చైతన్యం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, వికలాంగులు, మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక మంది ఉన్నత పదవులు, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు పొందుతున్నప్పటికీ ఆ హక్కుల కోసం పోరాడిన మహనీయులను, వారి త్యాగాలను మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కృతజ్ఞత లేని సమాజం ఎక్కువ కాలం స్వేచ్ఛగా మనుగడ సాగించలేదని, సామాజిక బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, వ్యాపారాలు కేవలం వ్యక్తిగత కుటుంబాల కోసమే కాకుండా సమాజాభివృద్ధికి కూడా ఉపయోగపడేలా కృషి చేయాలని, తమను ఈ స్థాయికి తీసుకొచ్చిన సమాజానికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞత కలిగి ఉండాలని మహంకాళి భిక్షు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఉపాధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, కార్మికులు కొయ్యడ అయిలయ్య, రమణారెడ్డి, సంగం కృష్ణ, గాదె రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ‘మగధీర’ సెట్స్‌లో రామ్ చరణ్ అల్లరి.. ఫన్నీ సీక్రెట్ బయటపెట్టిన కాజల్ అగర్వాల్!

**షూటింగ్ కు తన గుర్రం బదల్ ను చరణ్ తెచ్చాడన్న కాజల్**
**ఆ గుర్రంపై తనను తిప్పేవాడని వెల్లడి**
**బదల్ అని గట్టిగా పిలుస్తూ తనను టీజ్ చేసేవాడన్న కాజల్**



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ కాంబినేషన్‌లో వచ్చిన ‘మగధీర’ చిత్రం తెలుగు సినిమా చరిత్రలోనే ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. దర్శకధీరుడు రాజమౌళి విజువల్ వండర్‌గా తెరకెక్కించిన ఈ సినిమా ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. అయితే, ఈ సినిమా షూటింగ్ సమయంలో సెట్స్‌పై జరిగిన ఒక క్రేజీ అండ్ ఫన్నీ సీక్రెట్‌ను కాజల్ అగర్వాల్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టింది. షూటింగ్ గ్యాప్‌లో రామ్ చరణ్ తనను ఎలా ఆటపట్టించేవాడో కాజల్ గుర్తుచేసుకుంది. మగధీర సినిమాలో గుర్రపు స్వారీ సీన్లు ఎంతగా ఆకట్టుకున్నాయో తెలిసిందే. ఆ సమయంలో రామ్ చరణ్ తన సొంత గుర్రం ‘బదల్’ను షూటింగ్‌కు తీసుకువచ్చాడు. షూటింగ్ బ్రేక్‌లో తనను ఆ గుర్రంపై ఊరేగించడం ఒకెత్తయితే, ఆ తర్వాత చరణ్ చేసిన అల్లరి మరో ఎత్తు అని కాజల్ పేర్కొంది. సెట్‌పై తాను ఎప్పుడు కనిపించినా రామ్ చరణ్ తన గుర్రం పేరు “బదల్.. బదల్” అని పదేపదే గట్టిగా పిలుస్తూ తనను టీజ్ చేసేవాడని చెప్పుకొచ్చింది. ఆ టైంలో చరణ్ చేసిన ఫన్నీ కామెంట్లు, ఆటపట్టించిన విధానం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే గుర్తుండిపోయాయని కాజల్ ఆనందం వ్యక్తం చేసింది. కాగా, ప్రస్తుతం రామ్ చరణ్ తన తాజా చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఈ మోస్ట్ అవేటెడ్ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# పార్ట్‌టైమ్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ అమలు చేయాలి

**కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు పార్ట్‌టైమ్ అధ్యాపకుల వినతిపత్రం**



**కేయూ క్యాంపస్ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ, అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా నెలకు రూ.50 వేల వేతనం అమలు చేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రన్‌కు పార్ట్‌టైమ్ అధ్యాపకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సుమారు 165 మంది పార్ట్‌టైమ్ అధ్యాపకులు వివిధ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నప్పటికీ, వారి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పార్ట్‌టైమ్ అధ్యాపకులకు నెలకు రూ.50 వేల వేతనం అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. యూనివర్సిటీలలో బోధన వ్యవస్థ సజావుగా కొనసాగాలంటే పార్ట్‌టైమ్ అధ్యాపకుల సేవలు అత్యంత అవసరమని పేర్కొన్న వారు, వారికి మాత్రం తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. సెమిస్టర్ విధానంలో సంవత్సరంలో కేవలం ఆరు నెలలకే వేతనాలు అందుతున్నాయని, మిగతా కాలంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మారి అనేక మంది పార్ట్‌టైమ్ అధ్యాపకులు మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పార్ట్‌టైమ్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా కనీసం రూ.50 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐలేశ్వర్, డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ చల్ల శ్రీనివాస్, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ వావిళ్ల కుమారస్వామి, డాక్టర్ బి. నవీన్, డాక్టర్ రవీందర్ (ఎకనామిక్స్) తదితరులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ ‘రాకా’లో ‘మిన్నల్ మురళి’ బ్యూటీ



**అల్లు అర్జున్ - అట్లీ కాంబో చిత్రం**
**‘రాకా’లో ఫెమీనా జార్జ్**
**బన్నీకి ‘హ్యాపి’ సినిమా నుంచి**
**అభిమానినని చెప్పిన ఫెమీనా**
**ఇది తన కెరీర్‌లోనే అతి పెద్ద ప్రాజెక్ట్ అని వెల్లడి**
**దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్న సై-ఫై**
**యాక్షన్ సినిమా**
**మరో ముగ్గురు హీరోయిన్లకు అవకాశం**
**ఉందంటూ ప్రచారం**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం ‘రాకా’. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె ప్రధాన హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టులోకి మలయాళ నటి ఫెమీనా జార్జ్ కూడా అడుగుపెట్టారు. ‘మిన్నల్ మురళి’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఫెమినా, ‘రాకా’లో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. తన కెరీర్‌లోనే ఇది అతిపెద్ద ప్రాజెక్ట్ అని ఆమె తెలిపారు. అల్లు అర్జున్‌తో కలిసి స్క్రీన్ పంచుకోవడం ఒక కల నిజమైన క్షణమని ఆమె అభివర్ణించారు. అల్లు అర్జున్ నటించిన ‘హ్యాపీ’ సినిమా చూసినప్పటి నుంచి తాను ఆయనకు పెద్ద అభిమానిని అయిపోయానని ఫెమీనా పేర్కొన్నారు. తన పాత్ర నిడివి చిన్నదే అయినా, ఇంత భారీ చిత్రంలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో నలుగురు హీరోయిన్లు ఉండొచ్చని ప్రచారం జరుగుతుండగా, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి వారి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సై-ఫై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. టొవినో థామస్ హీరోగా వచ్చిన సూపర్ హిట్ చిత్రం ‘మిన్నల్ మురళి’తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి ఫెమీనా జార్జ్, తన కెరీర్‌ను ఆచితూచి ప్లాన్ చేసుకుంటున్నారు. తొలి సినిమాతో వచ్చిన భారీ విజయం తర్వాత, పాత్రల ఎంపికలో ఎంతో పట్టింపుగా వ్యవహరిస్తూ విభిన్నమైన కథలను ఎంచుకుంటున్నారు. ఇటీవల ఆమె నటించిన ‘కరక్కం’ అనే మ్యూజికల్ హారర్ కామెడీ చిత్రం బక్రీద్ సందర్భంగా మే 28న థియేటర్లలో విడుదలైంది. సుభాష్ లలిత సుబ్రహ్మణియన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీనాథ్ భాసి సరసన ఆమె నటించారు. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతోందని టాక్ వస్తోంది. ‘మిన్నల్ మురళి’లో బ్రూస్ లీ లతిక అనే కరాటే శిక్షకురాలి పాత్రలో ఫెమీనా నటనకు మంచి మార్కులు పడ్డాయి. సౌదీ అరేబియాలో పుట్టి, కేరళలో చదువుకున్న ఆమె, మోడలింగ్ నుంచి నటన వైపు వచ్చారు. ఆ తర్వాత ‘తీప్పొరి బెన్నీ’, ‘శేషం మైకేల్ ఫాతిమా’ వంటి చిత్రాల్లో నటించినా, ‘మిన్నల్ మురళి’ పాత్రనే ప్రేక్షకులు ఎక్కువగా గుర్తుంచుకున్నారు. ప్రస్తుతం ఫెమీనా ‘హైకూ’ అనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే కేరళలోని ఇడుక్కిలో ప్రారంభమైంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉండే ఫెమినా, విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకునే ప్రయత్నంలో ఉన్నారు.